# గుండెపోటుతో ఉపాధి కూలి మృతి



-ఎక్స్‌గ్రేషియో రూ.10లక్షలు చెల్లించాలి : దండి సురేష్ డిమాండ్

2లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 23 | మే | 2026
పేజీలు : 8

# మళ్లీ కబ్జాలు షురూ..!

**-చేష్టలూడిగిన అధికార యంత్రాంగం**
**-విలువైన భూములే లక్ష్యంగా ఆక్రమణలు**







**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం నగరంలో మళ్లీ కబ్జాల పర్వం ఊపందుకుంటుంది. ఈ కబ్జాల వ్యవహారంలోనే ప్రజాప్రతినిధులు, మంత్రుల అనుచరులు వీధి పోరాటాలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 2023లో ఖమ్మం నుంచి గెలిచిన తర్వాత ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు.ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములుగా నిర్ధారిస్తూ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొంత కాలం ప్రభుత్వ భూముల వైపు ఎవరు కన్నెత్తి చూడలేదు.

మిగతా 2లో..

# చెరువు చెరపై చర్యలేవి..?




**- ప్రజాపక్షం కథనాలతో కదిలిన అధికారులు, ఇప్పుడు ఎందుకు మౌనం..?**
**- కలెక్టర్ ఆదేశాలిచ్చిన బుట్టదాఖలవుతున్న వైనం**
**- మంత్రి పొంగులేటి సైతం చెరువు ఆక్రమణపై పలు మీటింగుల్లో ధ్వజం**
**- చెరువు, బఫర్ భూములు కాపాడాలని ప్రజల డిమాండ్**
**- సర్వేలు, నోటీసులకే పరిమితమైన అధికార యంత్రాంగం**
**- ప్రజా దర్బారులోనూ మంత్రికి అందిన చెరువు ఆక్రమణ ఫిర్యాదు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం ఊర చెరువు పరిరక్షణ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బారులోనూ ఆక్రమణపై ఫిర్యాదు చేయడంతో మరోమారు తెరపైకి వచ్చింది. ప్రధానంగా చెరువు చెరపై జరుగుతున్న ఆక్రమణలపై ఓ పక్క ప్రజాపక్షం దినపత్రిక వరుస కథనాలు, మరోపక్క సిపిఐ పార్టీ పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ అమలు మాత్రం కనిపించడం లేదు. ప్రజాపక్షం వరుస కథనాలతో స్పందించిన అధికారులు ప్రారంభంలో హడావుడిగా సర్వేలు నిర్వహించిన, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినా, ఆ తర్వాత చర్యలు నిలిచిపోయాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సైతం చెరువు భూములను కాపాడాలని పలు మీటింగులలో అధికారులకు సూచించారు. అయినప్పటికీ

మిగతా 2లో..

## సమష్టి కృషితోనే

# ప్రజాపాలన విజయవంతం




**- ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు**
**- ఘనంగా జిల్లా స్థాయి సమావేశం**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం, సమిష్టి కృషి తోనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంగా సాగుతోందని, ఇది ప్రజలను ప్రభుత్వానికి మరింత చేరువచేసే మంచి కార్యక్రమమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా స్థాయి సమావేశాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఏలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్,డిప్యుటీ మేయర్ మూడ్ గణేష్, సరిపురపు లలిత కుమారి, గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టతో పాటు తదితరులు పాల్గొన్నారు. ముందుగా క్లబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం సభావేదిక వద్ద జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ  అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి సాధించడం చాలా సులువన్నారు. ప్రతీ శాఖ బాధ్యతాయుతంగా పనిచేసిన నాడు అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువవుతాయని, గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిపై చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి ఫలాలు ప్రజల దరి చేరుతున్నాయని, ప్రతీ అంశాన్ని పరిగణలోనికి తీసుకుని ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జూన్ 12 వ తేదిన ప్రజాపాలన  ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమాన్ని పండుగ

మిగతా 2లో..

# మళ్లీ కబ్జాలు షురూ..!

**(మొదటిపేజీ తరువాయి)** ఏమి జరిగిందో కానీ గడిచిన నాలుగు నెలలుగా మరల భూ కబ్జా ము ఠాలు పడగ విప్పాయి. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా అక్రమించే పనిలో ఉన్నారు. ముఖ్యంగా ఎవరు అధికారంలో ఉంటే వారి పంచన చేరే ప్రజాప్రతినిధులు, నాయకులు అధికార పార్టీలను అడ్డం పెట్టుకుని కబ్జాలకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు ఎన్నెస్పి కాలువ కట్టలపై నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలను అక్కడి నుంచి వేరే ప్రాంతాల్లో వారికి స్థలాలు కేటాయించారు. పేదలు వదిలి వెళ్లిన కాలువ కట్టలు ఇప్పుడు పెద్దల పరం అవుతున్నాయి. చీమలు పెట్టిన పుట్టలు పాములపరమైనట్లు ఎన్నెస్పి కాలువ కట్టలను ఇప్పుడు ధనవంతులు ఆక్రమించి షెడ్లు వేసి అద్దెలకు ఇచ్చే పనిలో ఉన్నారు. ఎన్నెస్పి కాలువ కట్టలతో పాటు ఖమ్మం నగరం నుంచి వెళ్తున్న నాగార్జున సాగర్ ప్రధాన కాలువకు ఇరువైపులా కోట్ల రూపాయల భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఇటీవల ఇద్దరు కాంగ్రెస్ నేతలు ఓ భూమి విషయమై ఘర్షణ పడిన సంగతి విధితమే. ఇంకా వెలుగు చూడని భూ కుంభకోణాలు ఎన్నో ఖమ్మంలో చోటు చేసుకుంటున్నాయి. గతంలో ప్రజాప్రతినిధులుగా వ్యవహరించిన ఓ వ్యక్తి వందల గజాల భూమిని ఎన్నెస్పి కాలువ పక్కన ఆక్రమించి భవనాన్ని నిర్మించేందుకు అదును కోసం చూస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

**చేష్టలూడిగిన అధికార యంత్రాంగం...**

మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగం చేష్టలూడిగి చూస్తుండిపోతుంది. ఆక్రమణలకు సంబంధించి ఘర్షణలు జరిగితే పోలీసులు కేసులు నమోదు చేయడం తప్ప ఏమి చేసే పరిస్థితి కనిపించడం లేదు. పోలీసులు కూడా కేసు నమోదు చేయాలి కాబట్టి చేస్తున్నారు తప్ప చర్యలు శూన్యమన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కొందరు పోలీస్ అధికారులు స్థానికేతర మంత్రి చెప్పుచేతల్లో పనిచేస్తున్నారని గుస గుసలు వినిపిస్తున్నాయి. అందుకే ఆ మంత్రి అనుచరులు భూ కబ్జాల వైపు దృష్టిసారించారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక కొందరు ద్వితీయ, తృతీయ స్థాయి నాయకులు సోషల్ మీడియా ద్వారా మంత్రులు, అధికార పార్టీ నేతలతో ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో నిరంతరం ప్రచారం చేసుకుంటూ తాము అత్యంత సన్నిహితులుగా తమకు తాము ముద్ర వేసుకుంటూ అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. మొత్తంగా భూ కబ్జాల పర్వం ఇప్పుడు ఖమ్మం నగరంలో హాట్‌టాఫిక్‌గా మారింది.

**సుప్తావస్థలో కార్పోరేషన్ అధికారులు...**

ఇక కార్పోరేషన్ అధికారుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. వారికి ఓ ఫిర్యాదు వచ్చిన, వినతి వచ్చిన మంత్రి లేదా ఇతర ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు వచ్చిన ఉలుకు పలుకు ఉండదు. పన్ను కట్టిన అంతే పన్ను చెల్లించక పోయినా అంతే. రోజు కార్యాలయాలకు వస్తున్నాం తమ పని తాము చేసుకుంటూ వెళ్తున్నారు. ఒక నిర్లక్ష్య పూరిత వైఖరి కార్పోరేషన్ అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం కార్పోరేషన్ ఏర్పడిన తర్వాత ఈ స్థాయి ఆరోపణలు అధికార యంత్రాంగం మునుపెన్నడు ఎదుర్కొనలేదన్నది వాస్తవం. కార్పోరేషన్‌కు చెందిన ఉన్నత అధికారులపైన అవినీతి ఆరోపణలు లేకున్నా మిగిలిన అన్ని విభాగాల యంత్రాంగం అవినీతి ఊబిలో కూరుకుపోయిందని, భవనాల అనుమతి దగ్గర నుంచి అన్నింటిలోనూ పారదర్శకత లోపించిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి కబ్జాల నుంచి ప్రభుత్వ భూములను రక్షించడంతో పాటు కార్పోరేషన్‌లో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్ది పాలన గాడిన పడేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చెరువు చెరపై చర్యలేవి..?

**(మొదటిపేజీ తరువాయి)**

క్షేత్ర స్థాయిలో మార్పు లేకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. చెరువు విస్తీర్ణం తగ్గిపోతే భవిష్యత్తులో భూగర్భజలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, వర్షాకాలంలో వరద ముప్పు పెరిగే అవకాశముందని చెరువు పరిశర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, చెరువు భూములను ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**సర్వేలు, నోటీసులకే పరిమితం...**

చెరువు ఆక్రమణలపై ప్రజాపక్షం దినపత్రిక ప్రచురించిన కథనాలు, స్థానిక సిపిఐ పార్టీ చేపట్టిన పోరాటంతో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో ట్రైనింగ్ లైసెన్స్డ సర్వేయర్లతో చెరువు పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు పాయింట్ టూ పాయింట్ క్షుణ్ణంగా సర్వే నిర్వహించి, చెరువు భూమిలో కొన్ని ప్రాంతాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. అనంతరం సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అయితే అక్కడివరకే అధికారులు చర్యలకు పరిమితమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నోటీసులు అనంతరం ఆక్రమణల తొలగింపుపై ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**కలెక్టర్ ఆదేశాలు బుట్టదాఖలేనా..?**

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఏదులాపురం పర్యటనకు వచ్చిన అనుదీప్ దూరిశెట్టి చెరువును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు విశిష్టత, నీటి నిల్వ, సామర్థ్యం, పరిసర పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు ఆక్రమణలు తొలగించడంతో పాటు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే కాలక్రమేణా ఆ ఆదేశాల అమలు ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దూరిశెట్టి బదిలీ కావడంతో ఆ అంశమే పూర్తిగా కనమరుగైన పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రమంత్రి పొంగులేటి కూడా పలు సభలు, సమావేశాల్లో చెరువు ఆక్రమణలను తొలగించి పేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తామని ప్రకటించారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడకపోవడం విస్తుగొలుపుతోంది.కలెక్టర్ ఆదేశాలు, మంత్రి హామీలు, ప్రజల ఫిర్యాదులున్నప్పటికీ చర్యలు ముందుకు సాగకపోవడం ఆలసత్వ పరిస్థితికి అద్దం పడుతోంది. చెరువు పరిరక్షణ అంశం ఎందుకు మరుగున పడుతోందా? అనే ప్రశ్న ప్రధాన చర్చగా మారింది. ప్రస్థుత జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులు తీరు సరికాదు : దండి రంగారావు**

**28వ వార్డు కౌన్సిలర్.**



చెరువు ఆక్రమణపై జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అనేక సార్లు ఫిర్యాదులు చేశాము. ఒకసారి అధికారులు వచ్చి సర్వే చేసి వెళ్లారు. అటు తర్వాత ఇంత వరకు ఎటువంటి అతిగతి లేదు. ఈ విషయంపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోనూ పలుమార్లు ప్రస్తవించాను. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకొని చెరువును రక్షించాలి.

**మంత్రి దృష్టిలో ఉంది : ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి**

**మున్సిపల్ కమిషనర్.**



చెరువు అంశం విషయమై గౌరవ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టిలో ఉంది. వారి వద్ద నుంచి అధికారిక ఆదేశాలు వెలువడిన వెంటనే చెరువు అభివృద్ధిని చేపడతాము.

**ఫైల్ పెట్టమని చెప్పాను : వినయేందర్‌రెడ్డి, తహశీల్దార్.**



చెరువు ఆక్రమణ విషయంపై ఫైల్ పెట్టాల్సిందిగా మా అధికారులకు సూచించాను. దీన్ని పూర్తి స్థాయిలో పరిశీలన చేసి ఇరిగేషన్ అధికారులను సమన్వయం చేసుకొని ఆక్రమణలు తొలగింపుకు కృషి చేస్తాను.

# చింతకాని సహకార సంఘానికి తాళం



**ప్రజాపక్షం/చింతకాని :** గత నెల రోజులుగా కాటాలు వేసిన మొక్కజొన్న తరలించడం లేదని చింతకాని రైతులు శుక్రవారం చింతకాని సహకార సంఘానికి తాళం వేసి నిరసన తరలించారు. లారీలు పంపించకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే లారీలు పంపుతూ సామాన్య రైతుల ను చిన్నచూపు చూస్తున్నారని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్ మాట్లాడుతూ తాము నెల రోజులుగా కాటాలు వేసి ఎదురుచూస్తున్నా ఏజెంట్లు డబ్బులు ఇచ్చిన వారి బస్తాలు మాత్రమే లోడింగ్ చేయిస్తున్నారని సీరియల్ ప్రకారం లోడింగ్ చేయటం లేదన్నారు. అధికారులు తక్షణమే చింతకాని లో నిల్వ ఉన్న బస్తాలు వెంటనే గోడౌన్ కు తరలించాలన్నారు. త్వరితగతిన లారీలు పంపిస్తామని అధికారులు హామీతో రైతులు ఆందోళన విరమించారు.

# గుండెపోటుతో ఉపాధి కూలి మృతి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఉపాధిహామీ పథకం కూలీ మృతిచెందిన సంఘటన మండల కేంద్రం కొణిజర్లలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు కొణిజర్లకు చెందిన పాముల శ్రీను (53) రోజూ మాదిరిగానే శుక్రవారం కూడా ఉపాధిహామీపథకం పనికి వెళ్లి కాలువపూడిక తీత పనిచేస్తు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే కొణిజర్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. గత రెండు రోజులుగా ఎండలకు నీరసించి ఉన్నట్లు కుటుంబసభ్యులు తోటి కూలీలు అంటున్నారు. వడదెబ్బ కారణంగా మృతిచెందాడాలేక గుండెపోటుతో మృతిచెందాడనే విషయాన్ని వైద్యులు ధృవీకరించి ఉందని అధికారులు తెలిపారు. మృతునికి భార్య పద్మ, కూతురు ఉమా, కుమారుడు వీరబాబు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ఎక్స్‌గ్రేషియో రూ.10లక్షలు చెల్లించాలి : దండి సురేష్**

మృతుడు పాముల శ్రీను కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాముల శ్రీనివాసరావు మృతికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఎందుకంటే పనిచేస్తున్న ప్రాంతంలో వేసవులు నివారణకు సామాగ్రిని నిల్వ ఉంచలేదు. పని చేస్తున్న కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉన్నట్లుగా లేదు. ప్రభుత్వాలు ఇప్పటికైనా వేసవి నివారణ చర్యలు తీసుకొని పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతిచెందిన వారికి పరిహారం రెండు లక్షల ఏ విధంగా కుటుంబ యజమాని దానపోతే పోషణకు ఏ విధంగా సరిపోతాయో ప్రభుత్వమే చెప్పాలి. పథకం నిబంధనలో నష్టపరిహారం రూ.10లక్షలు వచ్చే విధంగా ఇన్సూరెన్స్ ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించి ఆ కుటుంబం ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు బౌతికఖాయాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, తెలంగాణ బికెఎంయు అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, కొణిజర్ల సిపిఐ గ్రామ కార్యదర్శి స్వర్ణ రమేష్, ఎర్ర శ్రీను, పుట్టా సత్యనారాయణ, రామారావు సందర్శించి నివాళులర్పించారు.

# సమష్టి కృషితోనే ప్రజాపాలన విజయవంతం

**(మొదటిపేజీ తరువాయి)** వాతావరణంలో జరుపుకుందామని చెప్పారు. అనంతరం పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హతగల ప్రతీ కుటుంబానికి చేరేవేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఆరు గ్యారెంటీల అమలుతో ప్రభుత్వం ప్రజలకు చేరువైందని, అర్హులకు న్యాయం చేయడమే ఏకైక లక్ష్యం అన్నారు. అనంతరం ఇల్లెందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే అగ్రగామిగా ఉన్నాయని, సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మేయర్ గణేష్ మాట్లాడుతూ ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా వార్డులు, బస్తీల్లో మెరుగైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నేరుగా ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యచరణను చేపట్టిందని, ప్రారంభ దశలో జిల్లాలోని సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు, సంక్షేమ వారోత్సవాలు, ఆరోగ్య శిబిరాలు విస్తృతస్థాయిలో చేపట్టినట్లు వివరించారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డీఓ మధు, అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు,పజాప్రతినిధులు, సబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రశ్నించేతత్వం నేర్పిన మందడపు నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ మధిర :** పేద ప్రజల కష్టాలు గుర్తించి వారి పక్షాన నిలిచి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించటం ద్వారా మందడపు నాగేశ్వరరావు జననేతగా ఖ్యాతి పొందారని, ఆయన అందించిన నిస్వార్ధ సేవల ఫలితంగానే మధిర పరిసర ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీ బలమైన పునాదులు ఏర్పడ్డాయని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో మాజీ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మల్లవరం మాజీ ఎంపిటిసి మందడపు నాగేశ్వరరావు ఐదో వర్ధంతి మల్లవరం సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. తొలుత సిపిఐ నాయకులు బిసి కాలనీలో నాగేశ్వరరావు విగ్రహం వద్ద ఉన్న జెండాను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జతేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. మందడపు నాగేశ్వరరావు విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగిన సభలో దండి సురేష్ మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా మల్లవరం ఎంపిటిసిగా నాగేశ్వరరావు యనలేని సేవలందించారని, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు వెంకటేశ్వరరావు, మందడపు రాణి, ఏనుగు గాంధీ, తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా అధ్యక్షులు బత్తినేని నీరజ, మండల నాయకులు మచ్చ వెంకటేశ్వరరావు, మందడపు నాగేశ్వరరావు పెద్ద కుమారుడు ధర్మతేజ, కాంగ్రెస్ మండల నాయకులు కరివేద రాంబాబు, సొసైటీ డైరెక్టర్ కొంగర రమేష్, నల్లమల శేఖర్, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి పరుచూరి రాము, మదుపల్లి గ్రామ శాఖ కార్యదర్శి జల్ల బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం




**-ప్రజల భాగస్వామ్యంతో పథకాలు విజయవంతం**
**-ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కలెక్టర్**
**-ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే ఖమ్మం ముందంజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండున్నర ఏళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభ సమయంలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం ఇందిరా మహిళా శక్తి క్రింద బ్యాంకు రుణాలు, కల్పన వంటి చర్యలతో పనులు వేగవంతమయ్యాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఖమ్మంజిల్లాలో పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఇటీవల ఎన్నికైన సర్పంచ్‌లు, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని సూచించారు. ఖమ్మంజిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, పారిశుధ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించనున్నట్లు పాఠశాల విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. వికలాంగ విద్యార్థులకు బ్యాటరీ ఆధారిత వాహనాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయి శాఖల అధికారులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలు లబ్ధిపొందుతున్న వివరాలను తెలిపారు. రాబోయే ప్రభుత్వ పథకాలను ప్రజలకు కలెక్టర్ సంపూర్ణంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, సర్పంచ్‌లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పనికి తగ్గ వేతనం ఇవ్వండి

**-మమ్ముల్ని కూడా ఉద్యోగులుగా గుర్తించండి**
**-రూ.5 వేలతో కుటుంబాలను ఎలా పోషించాలి..?**
**-విఓఏల ఆవేదన**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండలంలో గ్రామీణాభివృద్ధి కోసం సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న విఓఏలు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు) తమ జీవన సమస్యలపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు కేవలం రూ.150 గౌరవ వేతనం నుండి సేవలందిస్తున్నామని, ఇప్పటికీ రూ.5,000 వరకు మాత్రమే వేతనం అందుతున్న పరిస్థితుల్లో కుటుంబాలను పోషించడం కష్టమవుతుందని వాపోతున్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఎదుట సత్తుపల్లి మండల విఓఏల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షురాలు తుమ్మలపల్లి సరోజిని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో మేము కీలక పాత్ర పోషిస్తున్నామని, గ్రామాల్లో మహిళా సంఘాల నిర్వహణ నుంచి పేదల సంక్షేమ కార్యక్రమాల వరకు బాధ్యతలు నిర్వర్తిస్తున్నా, మాకు కనీస వేతనం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలను కనీసం నెలకు రూ.20 వేలుగా నిర్ణయించి, నేరుగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 18వ తేదీ నుంచి సమ్మె చేపట్టినట్లు సరోజిని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు నిరసన కార్యక్రమాన్ని విరమించమన్నారు. పని మాత్రం ప్రభుత్వ ఉద్యోగిలా చేపిస్తున్నారని, గౌరవం మాత్రం కాంట్రాక్ట్ కార్మికుల కంటే తక్కువగా చూస్తున్నారని మండిపడ్డారు. విఓఏ లు తమకు సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యంతో పాటు రూ.20 లక్షల బీమా కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా అధికారిక గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు. అర్హులైన విఓఏలకు కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా (సీసీలు) పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పేదల కోసం పని చేసే మేమే, ఇప్పుడు మా హక్కుల కోసం రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమని పలువురు మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సాదు చిట్టెమ్మ, నారపోగు సుధాకర్, సుజాత, అభిబున్నీస్సా, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, పద్మ, లత తదితరులు పాల్గొన్నారు.

# జెఎన్‌టియుహెచ్ ఫలితాల్లో సత్తా చాటిన ఎస్‌బిఐటి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు) హైదరాబాద్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ ద్వితీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్వర్ణభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి సత్తా చాటినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల సమర్థ బోధన, కళాశాల యాజమాన్యం అందిస్తున్న నాణ్యమైన విద్య ఫలితంగానే అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు. జెఎన్‌టియుహెచ్ ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో సిఎస్ఈ (ఏఐ ఎంఎల్) విభాగానికి చెందిన పి. శృతి, ఈసిఈ విభాగానికి చెందిన వి. నరేంద్ర 9.7 జిపిఏ సాధించి ఖమ్మం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. 9.5 జిపిఏకు పైగా 10 మంది విద్యార్థులు, 9 జిపిఏకు పైగా 108 మంది విద్యార్థులు సాధించి కళాశాల ఖ్యాతిని ఇనుమడింప జేశారన్నారు. 9.4కు పైగా జిపిఏ సిఎస్ఈ విభాగం నుంచి ఎం. సాయిదీప్తి, యు. రేణుక, జి. రుక్మిణి, బి. సాయి నిఖిత, జి. నందిని, ఎండి సొబియా, టి. జరీనా, వై. శ్రీవైష్ణవి, ఎండి షహనాజ్, సిఎస్ఈ (ఏఐఎంఎల్) విభాగం నుంచి ఎ. సాయితేజస్, వి. జయంత్, సి. పల్లవి, ఈసిఈ విభాగం నుంచి బి. ఉపశ్రీ, ఎస్‌కె హఫీజ్, వి. లిఖిత, కె. మల్లిక, బి. కావ్య, బి. రుచిత, సి. అజయ్‌కుమార్, సి. రాధిక, ఎస్‌కె కరీముల్లా, వై. అనుహ్య, ఈఈఈ విభాగం నుంచి బి. దయాకర్, డి. లక్ష్మి, జి. మనుశ్రీ, జి. శ్రీలక్ష్మి తదితరులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డా॥ జి. రాజేశ్‌కుమార్ తెలిపారు. కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతోనే ఉన్నత స్థానాలు అధిరోహించగలిగామని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి మాట్లాడుతూ విద్యార్థుల విజయం వెనుక వారి తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల అంకిత భావం ప్రధాన కారణమన్నారు. సాంకేతిక రంగంలో విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. వైస్ ఛైర్మన్ శ్రీచైతన్య మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ఫలితాలు కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు జి. ప్రవీణ్‌కుమార్, జి. శ్రీనివాసరావు, ఏవిపి శివప్రసాద్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ రూ.10లక్షల విలువ కలిగిన చెక్కులను మధిర పట్టణ, మండల లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పారుపల్లి విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మధిర నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు కోట్లాది రూపాయల చెక్కులను మంజూరు చేయించడం ద్వారా అనేక మంది ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించారని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, కౌన్సిలర్ బాణావత్ వెంకటరమణనాయక్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, కోరంపల్లి చంటి, బాజీ, బండారు నర్సింహారావు, రబ్బాని అనీల్, కరివేద సుధాకర్, సాలిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ :** మధిర మండలంలోని విత్తన దుకాణాలను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మధిర ఎడిఏ ఎస్.విజయచంద్ర, రూరల్ సిఐ డి.మధు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ సమీపిస్తున్న సందర్భంగా వచ్చినటువంటి విత్తనాలు వాటికి సంబంధించిన ఇన్వాయిసులు ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, స్టాక్ రిజిస్టర్స్ తనిఖీ చేశారు. విత్తనం అమ్మే డీలర్లు ఖచ్చితంగా ఇన్వాయిస్లు పిసిలు కలిగి ఉండాలని, స్టాక్ రిజిస్టర్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఎవరైనా సరైన డ్యాకుమెంట్స్ లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ విత్తనం చట్టం 1966లో బడి విత్తనాలు అమ్మాలని సూచించారు. స్టాక్ బోర్డ్ తప్పనిసరిగా తెలుగులోనే రాయాలని తెలిపారు. అనంతరం నవత, క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలను కూడా తనిఖీలు నిర్వహించారు. విడిగా వచ్చే విత్తనాల మీద ఎటువంటి సమాచారం వచ్చినా వెంటనే మండల వ్యవసాయాధికారికి కాని, దగ్గర్లో ఉన్న పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సాయిదీక్షిత్ పాల్గొన్నారు.

# నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మాలు ఏర్పాటు



**ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ :** అధిక ఉష్ణోగ్రతలతో ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మలపై ఏర్పడుతున్న ఓవర్ లోడ్‌ను అధిగమించి వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించే ప్రక్రియలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడికక్కడ నూతన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మలను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. మధిర పట్టణంలో బంజారాకాలనీ ఏరియాలో ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫారంపై అధికలోడ్ ఏర్పడడంతో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మాన్ని ఏర్పాటు చేసినట్లు మధిర పట్టణ ఎఇ ఎస్.అనిల్‌కుమార్ తెలిపారు.

# వివోఏల నిరవధిక సమ్మె

**ఐదవ రోజుకు చేరుకున్న ఐకెపి వివోఏ ల నిరవధిక సమ్మె**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ఐకెపి కార్యాలయం వద్ద ఐకెపి వివో ఏలు ఆధ్వర్యంలో 18వ తేదీ నుంచి జరుగుతున్న నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరుకుంది. కనీస వేతన చట్టం అమలు చేయాలని, హెచ్ ఆర్ పాలసీ అమలు పరచాలని, నేరుగా వేతనం వివోఏల ఖాతాలో జమ చేయాలని, అర్హత కలిగిన వివో ఏ లను సీసీలుగా పదోన్నతి కల్పించాలని, 58 జీవోను సవరించాలని కోరుతూ గత ఐదు రోజులుగా ఐకెపి కార్యాలయం ముందు నిరవధిక సమ్మె విఓఏ లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివోఏల సంఘ అధ్యక్షులు వేము నాగమణి, కార్యదర్శి కే. నీలవేణి, నాయకులు రమాదేవి, విజయలక్ష్మి, శ్రీదేవి ,దేవమణి ,మల్లికా, వెంకట్రావమ్మ ,అరుణ, రజిత ,సుమలత, పద్మ, జ్యోతి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రమాదంలో యువకుడు మృతి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం చెన్నూరు శివారు రావికంపాడు గ్రామానికి చెందిన గంధ్ర ఉపేంద్ర (30) శుక్రవారం ఉదయం తెల్లవారు జామున వదిలిపెట్టిన ఆవు రోడ్డుపై పడు కోవడంతో తెల్లవారుజామున ద్విచక్ర వాహనం తగలడంతో తలకు బలమైన గాయాలు కావడం వలన స్థానికులు సహకారంతో ఖమ్మం లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యం పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అతని భౌతిక దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మువ్వా విజయ్ బాబు ప్రధాన అనుచరులు అతని మృతితో చెన్నూరు, రావికంపాడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. అతనికి తండ్రి శ్రీనివాసరావు, తల్లి శ్యామల, తమ్ముడు రాము ఉన్నారు. పలువురు ఆ కుటుంబాన్ని సందర్శించి నివాళులు అర్పిస్తున్నారు.

## జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్‌గా గద్దల నియామకం



**ప్రజాపక్షం/పాల్వంచ :** జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ చైర్మన్‌గా పాల్వంచ మండలానికి చెందిన గద్దల రమేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ గాంధీ భవన్‌లో శుక్రవారం రాష్ట్ర ఎస్‌సి సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామక పత్రం అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ .. మాపై నమ్మకంతో జిల్లా చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి మల్లు విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. కష్టానికి తగిన గుర్తింపునిచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

## తోగ్గూడెంలో ఉచిత వైద్య శిభిరం



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి తోగ్గూడెం, రంగాపురం గ్రామాలలో ఐటిడిఏ పీఓ బి. రాహుల్ ఆదేశాలతో ఆదికర్మయోగి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. జగన్నాధపురం ప్రభుత్వ వైద్యశాల వైద్యులు శ్రీనిజ, సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణి చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజుల తరబడి నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, లేనిచో దోమలకు ఆవాసాలుగా మారి పలు రోగాలకు కారణమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తోగ్గూడెం సర్పంచ్ కేసరి శుభ, కార్యదర్శి రవి కుమార్, రంగాపురం కార్యదర్శి మౌనిక, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ అడిట్‌కు అర్చకులు సహకరించాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** రాష్ట్రంలో దూప, దీప, నైవేద్య పథకం పొందుతున్న దేవాలయాలపై జరగనున్న సోషల్ అడిట్‌కు అందరు సహకరించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు పురాణం కిరణ్ కుమార్ శర్మ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ అడిట్ ద్వార అర్చకులను కొంత ఇబ్బంది కలిగిన అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రముఖ దేవాలయాల్లో శీఘ్రం దర్శనం కలిగించడం హర్షనీయం అన్నారు. అలాగే మరణించిన డిడిఎన్ అర్చకులకు నాలుగు లక్షలు, అర్చకులు ఇల్లు కట్టుకున్న ఉపనయనం చేసుకొన్న ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పొడకంటి సంతోష్ కుమార్ చారి, కోశాధికారి కౌత్ ప్రసాద్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## సోసైటీ చైర్మన్‌గా తీగ రమణయ్య



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గా తీగ రమణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 8న డైరెక్టర్ మైశా శంకర్ ను పాలకవర్గం అంతా కలిసి అధ్యక్షుడు గా ఎన్నుకున్నారు. కాగా సోసైటీ లో తాను సీనియర్ సభ్యుడు గా ఉన్నానని రాయగూడెం కు చెందిన సోసైటీ మరో డైరెక్టర్ తీగ రమణయ్య హైకోర్టు ను ఆశ్రయించారు. సోసైటీ బైలా ప్రకారం తనకు అవకాశం కల్పించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి అధ్యక్షుడు గా తీగ రమణయ్య ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సోసైటీ కార్యాలయం లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోసైటీ బలోపేతం కు శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. సోసైటీ అధ్యక్షుడు గా బాధ్యతలు స్వీకరించిన రమణయ్య ను వివిధ పార్టీల నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ కార్యదర్శి ఖమ్మం వెంకటేశ్వర్లు ఉన్నారు.

## మొక్కలు పెంచటం బాధ్యతగా తీసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని, అది సామాజిక బాధ్యత అని జిల్లా పర్యాటక శాఖ ఇంచార్జీ అధికారి సునీల్ రెడ్డి అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం బౌద్ధక్షేత్రం వద్ద స్వచ్ఛత కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని సూచించారు. వ్యక్తిగత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యం కు మించిన ఆస్థి మరొకటి లేదన్నారు. ఆ ఆరోగ్యం ను కాపాడుకునేందుకు పర్యావరణం ను సంరక్షించాలన్నారు. పర్యాటక ప్రాంతం ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్:శివ, వివిధ పంచాయతీల సర్పంచ్ లు శీలం వెంకటలక్ష్మి, రాంబాబు, ఆయా పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# దంచి కొడుతున్న ఎండలు..!

**-పెరుగుతున్న వడదెబ్బ కేసులు**
**-రోడ్లపై నడవలేని పరిస్థితి**
**-ఇళ్లలో ఉన్నా ఊపిరాడని వేడి**
**-ఉష్ణోగ్రతలు సాధారణాన్ని మించి నమోదు**





**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ ఏడాది వేసవి లో భానుడు తన ఉగ్ర రూపాన్ని ప్రదర్శిస్తుండటంతో వడదెబ్బలు, నీరసం, తలనొప్పి, స్పృహ కోల్పోయే ఘటనలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా కార్మికులు, రైతులు, ఆటో డ్రైవర్లు, వ్యాపారులు, వృద్ధులు, చిన్నారులు అత్యధిక ప్రమాదంలో ఉన్నారు. వడ దెబ్బతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 9 గంటలకే ఎండ భగ్గుమంటుంది. మధ్యాహ్నం అయితే రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లలో ఉన్నా వాతావరణ హెచ్చరిక. ప్రజలు ప్రత్యక్షంగా అనుభవిస్తున్న వాస్తవం.

### ఎండలోనే జీవనం...

పొట్ట నింపుకోవాలంటే ఎండలోకి వెళ్లక తప్పని పరిస్థితి. రోజువారీ కూలీలు ఎండ ఎక్కువగా ఉందని పని మానేస్తే ఆ రోజు వంటగది వెలవెల రోడ్లపై నీడ లేకుండా పనిచేస్తున్న కార్మికులు వడదెబ్బకు గురవుతున్నా పట్టించుకునే వ్యవస్థ కనిపించడం లేదు, అయినా సరే, ప్రజల్లో అవగాహన కొరవడుతోంది. దాహం వేయకపోయినా నీరు తాగాలి అన్న సాధారణ విషయాన్ని కూడా చాలామంది నిర్లక్ష్యం చేస్తున్నారు. బస్ స్టాపుల్లో నీడ లేదు. రోడ్లపై తాగునీటి వసతి లేదు. కార్మికులకు విశ్రాంతి సమయం అమలు కావడం లేదు. ఇది కేవలం ప్రకృతి దోషమా? లేదా వ్యవస్థ వైఫల్యమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం, స్థానిక సంస్థలు వెంటనే స్పందించి తాగునీటి శిబిరాలు చలివేంద్రాలు అవగాహన కార్యక్రమాలు, కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టక పోతే ముప్పు తప్పదు.

### వడదెబ్బ లక్షణాలు...

తీవ్రమైన తలనొప్పి వాంతులు, మైకం శరీరం వేడిగా మారడం చెమట రాకపోవడం స్పృహ కోల్పోవడం ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకెళ్లాలి బట్టలు సడలించి, చల్లని నీటితో శరీరం తుడవాలి. స్పృహ ఉంటే నీరు ఓ ఆర్ ఎస్ ఇవ్వాలి. వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

### ఎండలో ఎక్కువ సేపు ఉండనివ్వొద్దు...

కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ తాగడం మంచిది. మద్యం, ఎక్కువ కాఫీ, కోల్డ్ డ్రింక్స్ సేవించొద్దు. లేతరంగు, పత్తి దుస్తులు ధరించాలని సూచించారు.

### నిర్లక్ష్యం చేస్తే మరింత ప్రమాదం : గౌరీ ప్రసాద్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్.



వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వేసవిలో (ఎండాకాలంలో) ఆరోగ్యంగా ఉండాలంటే ఈ ముఖ్యమైన జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ గౌరీ ప్రసాద్ అన్నారు. శరీర ఆరోగ్యం కోసం రోజుకు 8,10 గ్లాసులు నీరు తాగాలి. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం లాంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. బయటికి వెళ్లినప్పుడు గొడుగు టోపీ సన్ గ్లాసెస్‌ఉపయోగించాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య అత్యవసరం లేకపోతే బయటికి వెళ్లకపోవడం మంచిది. ఆహారంలో జాగ్రత్తలు తేలికగా జీర్ణమయ్యే ఆహారం తినాలి. పుచ్చకాయ, దోసకాయ, బొప్పాయి, మామిడి వంటి కాలానుగుణ పండ్లు తీసుకోవాలి. మసాలా, నూనె, ఫాస్ట్ ఫుడ్ తక్కువగా తీసుకోవాలి బయట తినే ఆహారం విషయంలో అత్యంత జాగ్రత్త చర్మ సంరక్షణ బయటికి వెళ్లే ముందు సన్ స్క్రీన్ క్రీమ్ వాడాలి. రోజుకు కనీసం రెండుసార్లు ముఖం కడగాలి. ఎక్కువ చెమట పట్టే చోట్ల శుభ్రంగా ఉంచాలి. పిల్లలు, వృద్ధులకు చిన్న పిల్లలు, వృద్ధులు డీహైడ్రేషన్కు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంటుంది తరచుగా నీరు తాగిస్తున్నారా చూసుకోవాలి.

# శవాల ఫ్రీజర్‌కే ఎసరు..!

**-దాతల సొమ్ము దొంగల పాటు, పంచాయితీ నిర్లక్ష్యంపై ప్రజల మండిపాటు**
**-సారపాక గ్రామ పంచాయితీలో చోరీ ఘటన కలకలం**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక మేజర్ గ్రామ పంచాయితీలో జరిగిన ఓ విచిత్రమైన చోరీ ఘటన ప్రజలను షాక్‌కు గురి చేసింది. బంగారం, నగదు, విలువైన వస్తువులకే కాదు..చివరకు మృతదేహాలను భద్రపరిచే శవాల ఫ్రీజర్ బాక్స్‌పైనా దొంగల కన్ను పడటం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాతలు నిరుపేదల సేవ కోసం అందించిన శవాల ఫ్రీజర్ బాక్స్‌లోని మోటార్, కంప్రెసర్ భాగాలను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనతో గ్రామ పంచాయితీ సిబ్బంది నిర్లక్ష్యం బట్టబయలైందంటూ ప్రజలు మండిపడుతున్నారు. ప్రజా ఉపయోగానికి ఉంచిన వస్తువులను కూడా కాపాడలేని స్థితిలో గ్రామ పంచాయితీ ఉందా..?అంటూ ప్రశ్నిస్తున్నారు. లక్షల రూపాయల విలువైన సామగ్రి ఉండి కూడా కనీస భద్రతా చర్యలు లేకపోవడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. దాతలు మంచి ఉద్దేశంతో ఇచ్చిన సామగ్రి దొంగల పాలవుతుంటే ఇకపై ఎవరు ముందుకు వస్తారు అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ కార్యాలయం, శ్మశానవాటికల భద్రతలపై పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం నెలకొన్నదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మండుతున్న ఎండల్లో మృతదేహాలు పాడవకుండా ఉంచేందుకు ఉపయోగించే ఫ్రీజర్ బాక్స్‌ను కూడా విడిచిపెట్టకుండా దొంగలు మోటార్ ఎత్తుకెళ్లడం దారుణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోటార్ మాత్రమే కాదు..ఫ్రీజర్ బాక్స్ మొత్తం తీసుకెళ్లి ఉంటే వేసవిలో అందులోనే పడుకునేవారేమో అంటూ స్థానికులు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. మృతదేహాలకు గౌరవం ఇవ్వాల్సిన చోట, వాటిని భద్రపరిచే పరికరాలనే ధ్వంసం చేసి చోరీ చేయడం అమానుషమని ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయితీ సిబ్బంది నిర్లక్ష్యంపై కూడా విచారణ జరిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నూతన మండల కమిటి ఎన్నిక



**ప్రజాపక్షం/ములకలపల్లి:**తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం మండల నూతన అధ్యక్షులుగా ముదిగొండ రాంబాబు, కార్యదర్శిగా మాలోత్ రావుజాతో పాటు మరో పద్దెనిమిది మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మండల వ్యాపితంగా గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులుగా భూక్యా సామిని, పులి వెంకటేశ్వర్లు, ముత్యాలు, కిషోర్, రవీందర్, కొనయ్య, ఇడుమ, రమేష్, పద్మ, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

# భానుడి భగభగలు..!

**- పెరిగిన ఉష్ణోగ్రతలు.. వేడి గాలులు**
**- అనధికార కరెంట్ కోతలు**
**- ఉక్క పోతతో జనం బేజార్**
**- అందుబాటులో ఉండని మున్సిపల్ అధికారులు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఉదయం ఏడు గంటల నుండే సూరన్న సెగలు మంటెక్కిస్తున్నాయి. వడగాలలు వేడెక్కిస్తున్నాయ్. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత రోజు రోజుకు పెరిగుతోంది. సాధారణ స్థాయికి మించి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేడి గాలులు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బయటకు రావటానికే జంకుతున్నారు. సమయ పాలన లేకుండా అనధికార విద్యుత్ కోతలు విధించటంతో తీవ్రమైన ఉక్కపోతకు ప్రజలు బేజారవుతున్నారు. ప్రజలు బయటకు రాని పరిస్థితి నెలకొన్నది. ఎండ తీవ్రత వీధి వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. కూరగాయలు ఎండకు కమిలిపోతున్నాయి. దీనితో నష్టాల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టాలను భర్తీ చేసుకొనేందుకు ధరలు పెంచి విక్రయించటం వలన వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా సూర్యాపేట, పెద్దపల్లి, హనుమకొండలతో పాటుగా పాల్వంచ యానంబైల్‌లో 46. 04 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో వారం రోజుల వరకు పరిస్థితి ఇలాగే కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఒక్కసారిగా తీవ్రతరమవుతున్న ఎండలు, వడగాల్పులతో విలవిలలాడి పోతున్నారు. బయటకొస్తే వడదెబ్బకు గురవుతామనే భయంతో అధిక సంఖ్యలో కూలీలు పనులు మానేసి ఇంటి పట్టునే ఉంటున్నారని తెలుస్తోంది. దీనితో నిర్మాణ రంగంపై పెను ప్రభావం చూపుతున్నది. జనం జీవనం స్థంభించి పోతున్నది. పాల్వంచ పట్టణంలో పలు వీధులు నిర్మానుష్యంగా జన సంచారం లేక వెలవెలబోతున్నాయి. బిజినెస్ లేకపోవటంతో వ్యాపారులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ళదీస్తున్నారు.

**- తాగునీటి ఎద్దడి :** ఎండాకాలంలో తాగు నీటి ఎద్దడి నివారణకు మునిసిపల్ అధికారులు ముందస్తు ప్రణాళికలు లేకపోవటంతో పాల్వంచ పట్టణంలో నీటి ఎద్దడి రోజు రోజుకు తీవ్రమవుతున్నది. ప్రతీ రోజు తాగునీటి సరఫరా పైపులు ఎక్కడో ఒకచోట లీకై అత్యంత విలువైన నీరు బజారుపాలవుతున్నది. తాగునీరు సరఫరాలో జాప్యం జరుగుతోంది. దీనితో ప్రజలు వాటర్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. చరవాణి ద్వారా సమస్యలను తెలియజేద్దామంటే మునిసిపల్ అధికారి సామాన్యులకు అందుబాటులో ఉండరని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనితో భారమంతా నూతనంగా ఎన్నికైన కార్పోరేటర్ల పైనే పడుతోంది. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారటంలో సందేహం లేదు.

**- మూగజీవాల విలవిల :** పెరుగుతున్న ఎండలతో ప్రజలతో పాటుగా మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. గతంలో మునిసిపాలిటి కమీషనర్‌గా విధులు నిర్వహించిన చింతా శ్రీకాంత్ ఎండాకాలంలో మూగజీవాలు, జంతువుల దాహార్తిని తీర్చటానికి పాల్వంచలోని పలు వీధుల్లో నీటి తొట్లు ఏర్పాటు చేసి నీటిని అందించేవారు. ప్రస్తుత అధికారులు వాటిని పట్టించుకోక పోవటంతో లక్ష్యం నీరుగారిపోయిందని పలువురు విమర్శిస్తున్నారు.

**- అత్యవసరమైనే బయటకు రావాలి :** వచ్చే నాలుగు రోజులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఎండలు, వడగాల్పులతో పెను ప్రమాదం పొంచి ఉందని అత్యవసరమైతేనే బయటకు రావాలని తహశీల్దార్ దారా ప్రసాద్ అన్నారు. కార్యాలయాలలో పని ఉన్నవారు సాయంత్రం 4 గంటలకు రావాలన్నారు. అధికారులు 6 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. వడదెబ్బ తగలకుండా రైతులు కల్లాలో ఉదయం 10 గంటల వరకు పని ముగించుకోవాలని సూచించారు. పనిపై బయటకు వచ్చేవారు ఎండ తగలకుండా గొడుగు లేదా తలపాగా ధరించాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా తరచూ నీటిని, మజ్జిగ తీసుకోవాలని, ఏమాత్రం నీరసంగా ఉన్నా వెంటనే వైద్యులు సంప్రదించి చికిత్స తీసుకోవాలని చెప్పారు.

## మణుగూరు చెరువుల్లో సందడి చేస్తున్న వలస కొంగలు

**-ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్న అరుదైన దృశ్యాలు**
**-''ప్రకృతి అందాలకు కొత్త శోభ''**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు పరిసర ప్రాంతాల్లోని చెరువులు, నీటి మడుగుల్లో ఇటీవల పెద్ద సంఖ్యలో కొంగలు కనిపిస్తూ స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. నల్ల తెలుపు రంగులతో ప్రత్యేక ఆకర్షణగా కనిపించే ఈ పక్షులు ఎక్కువగా “ఏషియన్ ఓపెన్‌బిల్ స్టార్క్స్” జాతికి చెందినవిగా భావిస్తున్నారు. చెరువుల్లో నీరు నిల్వ ఉండటం, నత్తలు, చిన్న చేపలు సమృద్ధిగా లభించడం వల్ల ఈ పక్షులు మణుగూరు ప్రాంతానికి చేరుకున్నట్లు ప్రకృతి ప్రేమికులు చెబుతున్నారు. సాధారణంగా వర్షాకాలం తర్వాత లేదా నీరు ఎక్కువగా ఉండే కాలంలో ఇవి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరిస్తూ ఉంటాయి. ప్రస్తుతం మణుగూరులో గుంపులుగా కనిపిస్తున్న ఈ కొంగలు ఉదయం మరియు సాయంత్రం సమయాల్లో చెరువుల వద్ద ఆహారం కోసం సంచరిస్తూ ప్రత్యేక దృశ్యాన్ని సృష్టిస్తున్నాయి. కొన్ని పక్షులు గాల్లో గుంపులుగా ఎగురుతూ కనిపించడం స్థానికులను ఆకట్టుకుంటోంది. పర్యావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇటువంటి పక్షులు ఒక ప్రాంతంలో కనిపించడం అక్కడి జీవవైవిధ్యం ఇంకా నిలిచి ఉందనే సంకేతం. అయితే వేసవి తీవ్రత పెరగడం, చెరువులు ఎండిపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలు పెరగడం వంటి కారణాలు ఈ పక్షుల జీవనానికి ప్రమాదంగా మారే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. స్థానిక ప్రజలు చెరువుల పరిశుభ్రతను కాపాడుతూ, పక్షులకు ఇబ్బంది కలగకుండాజాగ్రత్త తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

## ఎండల తీవ్రతకు ఉపాధి హామీ పనులను త్వరగా ముగించాలి

**-ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఎండల తీవ్రతకు ఖమ్మం జిల్లా రెడ్ అలర్ట్ ప్రకటించడంతో ఉపాధి హామీ పనులను త్వరగా ముగించాలని ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీజ అన్నారు. ఉదయం 7గంటల సమయంలో ఏన్కూర్‌లో ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల కూలీల సంఖ్య తక్కువగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీల సంఖ్య పెరిగే విధంగా చూడాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. ఉపాధి కూలీలకు మంచినీటి సౌకర్యంతో పాటు టెంట్లు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. కూలీలు చేసే పనిని ఆమె స్వయంగా పరిశీలించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయంటూ కూలీలను అడగగా కూలీలు ఆమెతో సరిపడా మంచినీటి సరఫరా లేదంటూ, ఎండలకు టెంట్లు కూడా వేయట్లేదు, ఐదుగురు మేట్లతో తీయవలసిన ఫోటోలు ముగ్గురి మెట్లతోనే ఫోటోలు తీస్తున్నారని, దాని వల్ల ఇంటికి వెళ్లేందుకు చాలా టైం పడుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. మీరు రావడంతో మంచినీటితో పాటు టెంట్లు వేశారని కూలీలు తెలిపారు. మంచినీటి సౌకర్యం, ఎండకు టెంట్లు వేయకుండా ఏం చేస్తున్నారంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఆమె అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, పంచాయితీ కార్యదర్శి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో జరిగే భారీ ర్యాలీని జయపద్రం చేయండి



**ప్రజాపక్షం/ఏన్కూరు:**ఖమ్మంలో జరిగే భారీ ర్యాలీని జయపద్రం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర కుమార్ అన్నారు. ఖమ్మం సుడా ఛైర్మన్‌గా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా శుక్రవారం ఏన్కూరులో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవరెడ్డి భవన్ నుంచి ఎస్ఆర్ గార్డెన్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ ర్యాలీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి, వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఈ బ్లాక్ అధ్యక్షులు వేముల కృష్ణ ప్రసాద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి సామేలు, మాజీ ఎంపిటిసి మేడ ధర్మారావు, మండల యూత్ అధ్యక్షులు నిమ్మల నాగేశ్వరరావు, నాయకులు మాలోతు నరసింహారావు, గోళ్ళు చిన్నస్వామి, దళిపతి భువనేశ్వర్ రాజు, గూడచారి, ములకలపల్లి రవి, పంతగాని నరేష్, నాగేశ్వరరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ చొరవతో మాదారం గ్రామానికి సీసీ డ్రైనేజీకు నిధులు మంజూరు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం మాదారం గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న వర్షపు నీటి సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. గ్రామంలో ప్రతి సంవత్సరం వర్షాల సమయంలో నీరు ఇండ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ చొరవ తీసుకుని సీసీ డ్రైనేజీకు నిధుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఇటీవల మొక్కజొన్న కొనుగోలు కేంద్ర ప్రారంభ కార్యక్రమానికి హాజరైన ఎంఎల్ఏకు గ్రామ ప్రజలు తమ సమస్యను వివరించగా, వెంటనే స్పందించిన ఎంఎల్ఏ గ్రామంలో పరిస్థితులను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా జెడ్పి నిధుల నుంచి రూ 19లక్షలు మంజూరు చేయించారు. ఈ పనులను అత్యవసరంగా ప్రారంభించి, వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎంఎల్ఏ ఆదేశాలు జారీ చేశారు. తమ సమస్యను గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేయించిన ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్‌కు గ్రామ ప్రజలు, స్థానిక సర్పంచ్, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## వైరా బీఆర్ఎస్ సభ్యత్వాల ఇన్‌చార్జిని కలిసిన నాయకులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాల ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణని వైరా నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, నియోజకవర్గంలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహిస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని నాయకులు పేర్కొన్నారు. ఈ భేటీలో సింగరేణి బీఆర్ఎస్ పార్టీ నాయకులు డోంకేన రవీందర్, జడల కళ్యాణ్ పాల్గొన్నారు.

## ఎండ వేడిమికి ద్విచక్ర వాహనం దగ్ధం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఎండ వేడిమి తీవ్రత కారణంగా తల్లాడ కొత్తగూడెం రాష్ట్రీయ రహదారిపై ద్విచక్ర వాహనం దగ్ధమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు శివారు సీతారామ ప్రధాన కాల్వ పైన నిర్మించిన బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ వైపు నుంచి పాల్వంచ వైపు స్కూటీ పై దంపతులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన నుంచి ఒక్క సారిగా మంటలు వ్యాపించడంతో వాహనం నడుపుతున్న వ్యక్తి వాహనాన్ని రోడ్డు పక్కన వదిలివేసాడు. మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయం, వేసవి ఎండల తీవ్రత, వేడి గాలులు ఎక్కువగా ఉండటం వాహనం నుంచి మంటలు ఒక్క సారిగా ఎగిసిపడటంతో టూ వీలర్ పూర్తిగా కాలిపోయింది. చుట్టుపక్కల పొలాల వారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అప్పటికే స్కూటీ పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాక పోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ సంఘటనతో కొత్తగూడెం ఖమ్మం జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటర్ మేర వాహనాలు స్థంబించాయి. వాహనంపై ప్రయాణిస్తున్న వారికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియవలసి ఉంది. పగటి ఉష్ణోగ్రతలు గత వారం రోజులుగా జూలూరుపాడు మండలంలో ఉస్నోగ్రతలు 45 డిగ్రీలు నమోదు అవుతున్నాయని, వేడిని తట్టుకోలేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వేడికి ద్విచక్ర వాహనం అగ్ని ప్రమాదానికి గురైన సంఘటన ప్రజలను ఆందోళనకు గురిచేసింది.

# అశ్వారావుపేటలో భారీగా పట్టుబడ్డ గంజాయి





**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో గంజాయి భారీగా పట్టుబడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేట బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలో 300కేజిల డ్రై గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఒడిశా నుంచి రాజస్థాన్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు పట్టుకున్నట్లు తెలిపారు.సుమారు 1.5 కోట్లు విలువ చేసే గంజాయిని పట్టుకున్నట్లు, గంజాయిని రవాణా చేస్తున్న 7గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవటంతో పాటు ఒక బెలెరో కార్, ఒక కంటైనర్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత రెండేళ్లుగా రూ.6.70 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండేళ్లుగా ఏకంగా 15,293 కేజిల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యధిక గంజాయిలు కేసులు నమోదు అవుతున్నాయని, నిషేధిత గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. ఎవరైనా నిషేదిత గంజాయిని రవాణా చేసినా, అమ్మినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇతర పోలీస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# భార్యను కొట్టి ఉరివేసి.. ఆత్మహత్యగా చిత్రీకరణ



**-ఇన్సూరెన్స్ డబ్బులు కోసం కట్టుకున్న భార్యను హత్య చేసినట్లు బంధువుల ఆరోపణ**
**- తిరుమలాయపాలెం గోల్ తండాలో దారుణ ఘటన**

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మండలంలో దారుణ ఘటన వెలుగు చూసింది. భార్యను తీవ్రంగా కొట్టి అనంతరం చున్నీతో ఉరివేసి హత్య చేసి దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోల్ తండాకు చెందిన బానోత్ శివాజీ మీనాక్షి దంపతులు 12 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా గత కొంతకాలంగా దంపతుల మధ్య తరచుగా వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్యన ఘర్షణ జరగగా ఆ సమయంలో శివాజీ మీనాక్షి తీవ్రంగా కొట్టాడని అనంతరం చున్నీతో ఉరివేసి చంపి దాన్ని ఆత్మహత్యగా చూపించే ప్రయత్నం చేశాడని కుటుంబసభ్యులు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మీనాక్షి ఒంటిపై గాయాలు ఆనవాళ్లు గుర్తించినట్లు సమాచారం అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. స్థానికులు చెప్పే వివరాల ప్రకారం వారు నూతనంగా నిర్మించుకున్న ఇంటిపై రూ.80లక్షల లోన్ ఉంది, ఆమె పేరు మీద కోటి రూపాయల ఇన్సూరెన్స్ ఉంది. ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం భార్యని చిత్రవద చేసి, చివరకు హత్య చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో భార్యను కింద పడేసి పిడిగుద్దులతో హింసించిన దృశ్యాలు చూపించి భర్త భార్యను చిత్రహింసలు పెట్టినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. 14 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకుని ఇద్దరు కుమారులతో పాతర్లపాడు స్టేజి దగ్గరలోని గోల్ తండాలో కాపురం పెట్టి మీనాక్షి, శివాజీ దంపతులు జీవనం కొనసాగిస్తున్నారు. భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్న ఇంతటి ఘటన చోటు చేసుకుందని ఊహించలేదని స్థానికులు వెళ్లబుచ్చారు. భర్త శివాజీ భార్యను హత్య చేసి ఉరేసుకున్నట్లుగా చిత్రీకరించి భర్త ఏమి తెలియనట్లుగా పోలీస్‌స్టేషన్లో లొంగిపోయినట్లుగా సమాచారం. ఇన్సూరెన్స్ డబ్బు కోసమే ఈ హత్య జరిగిందా శివాజీ మనసులో మరి ఏదైనా దురద్దేశం ఉందా అనే కోణంలో విచారణ జరపాలని కోరుతున్నట్లు మృతిరాలి బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పూర్తి సమాచారం తెలవాలంటే పోస్టుమార్టం రిపోర్టు వస్తేగాని, హత్య జరిగిందా లేకపోతే ఆత్మహత్యతానే చేసుకుందా అనే పూర్తి సమాచారం తెలుస్తుందని స్థానికులు చెబుతున్నారు.

# హాస్పటల్ వర్కర్ల జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ మధిర :** ఈనెల 25న కల్లూరు మండల కేంద్రంలో జరగబోయే ప్రభుత్వ హాస్పటల్స్‌లో పనిచేస్తున్న పేషంట్ కేర్, సెక్యూరిటీ, శానిటేషన్ వర్కర్స్, సూపర్వైజర్‌ల ఖమ్మంజిల్లా ప్రథమ మహా సభలను జయప్రదం చేయాలని ఎఐటీయూసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. మధిర ఏరియా ఆసుపత్రిలో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించిన మాదిరిగానే కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ప్రతినెల 1వతేదీన జీతాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పేషంట్ కేర్,సెక్యూరిటీ శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం నాలుగు పండుగ సెలవులు నాలుగు జాతీయ సెలవులు 20రోజులకు ఒకటి చొప్పున సంవత్సరానికి 23 ఆర్జిత సెలవులను మంజూరుచేయాలని, రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు నాన్ ప్రాఫిట్ బోనస్ కింద మినిమం బోనస్‌గా ఒక నెల జీతం చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాసభకు ప్రతిఒక్క కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షులు చెరుకూరి వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు యామాల రాజు, టి.పద్మ, మోదుగు రాజశేఖర్, ఆర్.సురేష్, జి.గోపి, బి.శాంతిప్రియ, సువాసిని, రాణి తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి దహన సంస్కారాలకు ఆర్ధికసాయం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం విప్పలమడక గ్రామంలో గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందిన బూర్గు బాయమ్మ దహన సంస్కారాల కోసం ఆ గ్రామానికి చెందిన మేడా శంకరయ్య సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. శుక్రవారం మృతురాలి బంధువులకు మాజీ సర్పంచ్ తుమ్మల జాన్‌పాపయ్య చేతుల మీదుగా ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లికొండ వీరభద్రరావు, మాజీ ఉప సర్పంచ్ వీరపనేని చెన్నకేశవరావు, వార్డు మెంబర్ బూర్గు నందిని, మేడా సంపత్, వీరపనేని తిరుపతయ్య, ఈలప్రోలు వేణు, ఏసు కృపా, బూర్గు యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడకండి న్యాయం చేస్తాం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో తప్పకుండా న్యాయం చేస్తామని మున్సిపల్ కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి రోడ్డు నిర్మాణంలో ఇండ్లు నష్టపోతున్న బాధితులకు భరోసా కల్పించారు. శుక్రవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 30వ వార్డులోని ఆటో నగర్ టు మద్దులపల్లిరోడ్డు ఏర్పాటు పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆటో నగర్ కాలనీలోరోడ్డు విస్తరణ కారణంగా ఇండ్లు కోల్పోతున్న బాధితులు తమకు న్యాయం చేయాలని కమిషనర్‌ను వేడుకున్నారు. వారి సమస్యలను ఓపికగా విన్న కమిషనర్ స్పందిస్తూ ప్రజలు రోడ్డు నిర్మాణానికి సహకరించాలని, బాధితులకు తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆటోనగర్ ప్రారంభం నుంచి ఇండ్ల వరకు 40అడుగులు రోడ్డు నిర్మితమయ్యేలా మంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఇలా చేయడం వలన ప్రహరీ గోడలు పోయే అవకాశం ఉంటుందని అందుకు బాధితులు తమ పూర్తి సహకారం అందించాలని కోరారు. అలాగే బాధితులు ఓ వినతిపత్రాన్ని ఇవ్వాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి జీఎం కార్యాలయంలో అన్ని విభాగాలు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్‌ను ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి జీఎం కార్యాలయంలో పర్సనల్, ఫైనాన్స్ సహా అన్ని విభాగాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సింగరేణి సీఎండీకి జీఎం ద్వారా వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం వివిధ పనుల కోసం ఉద్యోగులు 90 కిలోమీటర్లు ప్రయాణించి కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోందని ఆయన తెలిపారు. సత్తుపల్లి ఏరియా నుంచి అధిక ఉత్పత్తి, రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అలాగే పీవీఎన్ కాలనీలో పార్కింగ్ రూఫ్ షెడ్, కమ్యూనిటీ హాల్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి

### కార్మికులకు సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలి : నిమ్మటూరి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోనీ సిద్ధారం రోడ్ ఆటో ఓనర్ కమ్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ఏఐటియుసి ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పెరిగిన పెట్రోల్, డీజిల్ వలన ఆటో కార్మికులపై ములీగే నక్క పైన తాటికాయ పడ్డట్టుగా మారిందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పన్నులు విధిస్తుందని, ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో తమమ ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీని సంవత్సరానికి రూ. 12,000 నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు కల్పిస్తూ, బడుగు జీవులపై పన్నుల భారం మోపటం ఎంతవరకు సమంజసమని రామకృష్ణ ప్రశ్నించారు. తక్షణమే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ చట్టాన్ని తీసుకువచ్చి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జక్కంపూడి వెంకటరావు, పుల్లయ్య, అధ్యక్షులు చిల్లకండ్ల కాశి రావు, భయ్యా కోటేశ్వరరావు, కొండపల్లి రాంబాబు, తడికమళ్ళ హరిబాబు, పర్సా వెంకన్న, గరికంటి అర్జున్ రావు, సకుర్తి వెంకటేశ్వరరావు, గూదే వినయ్, మరికంటి వెంకటేశ్వరావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదీపికల నిరవధిక సమ్మె

**ప్రజాపక్షం/వైరా:** వైరాలో తెలంగాణ రాష్ట్ర ఐకెపి రాష్ట్ర కమిటీ జేఏసి పిలుపు మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ వైరా మండలం ఆధ్వర్యంలో శాంతియుత నిరవధిక సమ్మె చేస్తున్నట్లు సెర్ప్ వైరా మండలం శాఖ నిర్వాహకులు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు డిమాండ్లను రాష్ట్ర కమిటీకి తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. విఈవోల కనీస వేతనం రూ.20వేలకు పెంచాలని సెర్ప్ ఉద్యోగాలుగా పరిగణించి హెచ్ఆర్ పాలసీను చేయాలని, అర్హులైన వివోఏలకు సిసిగా పదోన్నతి కల్పించాలని సామాజిక ఆరోగ్య భీమా సౌకర్యం ట్యాబ్ సౌకర్యం కల్పించాలని జీవో నెంబర్ 58ని సవరించాలని పలు డిమాండ్లతో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సమస్యల హక్కులను డిమాండ్లను సానుకూలంగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మావతి శైలజ, ప్రభావతి, నిర్మల, మమతా తేజ, ప్రభావతి సంజు రమాదేవి , రాధామణి, మల్లీశ్వరి, విజయలక్ష్మి , స్రవంతి, గద్దె నీరజ తదితరులు పాల్గొన్నారు.

# బాలమ్మ సేవలు చిరస్మరణీయం



### - కూనంనేని, సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సీనియర్ కామ్రెడ్ శంకర్ మాతృమూర్తి గుగులోతి బాలమ్మ సిపిఐకి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆమె అకాల మరణం పార్టీకి తీరని లోటని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో కలిసి ఆయన రామవరంలోని 19వ డివిజన్‌లో ఉన్న ఉన్నందాస్ గడ్డ శాఖ 2 పరిధిలో తుదిశ్వాస విడిచిన బాలమ్మ మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె కమ్యూనిస్టు పార్టీకి ఎంతో కీలంగా విలువైన సేవలను అందించారన్నారు. ప్రజా సంక్షేమం కోసం అమె అహర్నిశలు శ్రమించే వారని, స్వయంగా ప్రజల కష్టాలను తెలుసుకుని పార్టీ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి పాటుపడే వారన్నారు. కష్ట కాలంలో బాలమ్మ కుటుంబానికి సిపిఐ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాలమ్మ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, ఎస్కే జలీల్, తొగరు నరేందర్, బానోత్ చందర్, భూక్యా మహేష్, హబీబ్, అలీమ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# నాడు పదవులు అనుభవించి, నేడు విమర్శిస్తారా..?



### - ఎంఎల్‌ఏ కోరం వ్యాఖ్యలపై బిఆర్ఎస్ కార్పొరేటర్ సింధు తపస్వీ ఆగ్రహం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అప్పుడు దర్జాగా బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉండి పదవులు అనుభవించి ఇప్పుడు ఇష్టాను సారంగా ఆ పార్టీనే విమర్శిస్తారా అంటూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ బిఆర్ఎస్ కార్పొరేటర్ సింధు తపస్వీ అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశంలో ఇల్లెందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు మేలు చేసే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పేదలకు అన్యాయం జరిగిందని, పేదల్లలో అర్హులైన పేదలకు ఒక్క రేషన్ కూడా అందించలేదని అన్నారు. దీంతో సమావేశంలో ఉన్న సింధు తపస్వీ లేచి ఎంఎల్‌ఏ వ్యాఖ్యలపై అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం పలు పదవులు అనుభవించిన కోరం కనకయ్య ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి ఎంఎల్‌ఏగా గెలిచినంత మాత్రాన బిఆర్ఎస్ హయాంలో పొందిన మేళ్లను మర్చిపోయి స్వార్థపూర్తి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేళ్లను కూడా వివరించాలని అగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఒక్కసారిగా సమావేశంలో వాతావరణం మారిపోయింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను అడ్డుకుని సమావేశం సజావుగా జరిగేలా సహకరించాలని కోరడంతో శాంతించారు. అనంతరం అశ్వాపురం మండలం చింతిర్యాల గ్రామపంచాయితీ బిఆర్ఎస్ సర్పంచ్ అలివేలు మాట్లాడుతూ ప్రశ్నించే వారిని అడ్డుకోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

# త్రీ ఇంక్లైన్ గ్రామ సర్పంచ్ భర్తపై దాడి



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** చుంచుపల్లి మండలంలోని త్రీ ఇంక్లైన్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఈసం ప్రవళిక భర్త రాజీవ్ గాంధీపై గురువారం రాత్రి దాడి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో సర్పంచ్ గెలుపునకు కృషి చేసిన బొల్లి కార్తీక్‌పై అదే పంచాయతీకి చెందిన కట్ట శ్రీనివాస్, నేరేడుమల్లి నవదీప్ ఈ ఏడాది మార్చి 20న దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో బొల్లి కార్తీక్ ముక్కు ఎముక విరిగినట్లు తెలిసింది. బాధితుడు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసుకు సంబంధించిన మెడికల్ రిపోర్ట్ ఏప్రిల్ 21న వచ్చినట్లు సమాచారం. ఈ కేసులో నిందితులైన శ్రీనివాస్, నవదీప్‌లను గురువారం పోలీసులు రిమాండ్‌కు పంపించారు. అయితే తమ కుమారుడు జైలుకు వెళ్లడానికి సర్పంచ్ భర్త రాజీవ్ గాంధీ కారణమని భావించిన నేరేడుమల్లి నవదీప్ తండ్రి సునీల్, గురువారం రాత్రి రాజీవ్ గాంధీపై కూల్ డ్రింక్ సీసాలు, రాళ్లతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో రాజీవ్ గాంధీ తలకు రెండు చోట్ల గాయాలయ్యాయి. ఆయనకు కుట్లు పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాడి ఘటనపై రెండో పట్టణ పోలస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు, అలాగే డీఎస్పీ ఆదినారాయణకు కూడా వినతి అందించినట్లు వారు పేర్కొన్నారు.

# ఆరోగ్య హాస్పిటల్‌కు అరుదైన గుర్తింపు



CAHO | ACE AWARENESS COMPLIANCE EXCELLENCE

CERTIFICATE

OF RECOGNITION

AWARDED TO

*Arogya Health City LLP, Khammam, Telangana*

MEDIUM HEALTHCARE ORGANIZATION

For demonstrating excellence in CSSD services under the ACE-CSSD initiative, a CAHO quality program. Certification granted upon successful completion of audits with 80% compliance.

Technical Guidance Collaborator

3M Science. Applied to Life.™

Dr. Vijay Agarwal
President- CAHO

This Certificate is valid till April 2027

### -కాగో సర్టిఫికేషన్‌లో ఖమ్మం జిల్లాకు తొలి ఘనత




**ప్రజాపక్షం/ఖమ్మం వైద్య విభాగం:** తెలంగాణలోని ఆరోగ్య హెల్త్ సిటీ ఎల్ఎల్‌పి కు ప్రతిష్టాత్మకమైన కాగో ఏసిఈ సిఎస్ఎస్‌డి సర్టిఫికేషన్ సాధించిన ఖమ్మం జిల్లాలోని తొలి హాస్పిటల్‌గా ఆరోగ్య హాస్పిటల్ నిలిచింది. ఈ గుర్తింపు ద్వారా ఆరోగ్య హాస్పిటల్ అత్యున్నత స్థాయి స్టెరిలైజేషన్ విధానాలు, రోగి భద్రతా ప్రమాణాలు మరియు అంతర్జాతీయ స్థాయి వైద్య నాణ్యతను పాటిస్తున్నట్లు మరోసారి నిరూపితమైంది. సర్జరీల తర్వాత ఇన్ఫెక్షన్ల ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. రోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత . అంతర్జాతీయ ప్రమాణాలకు సమానమైన వైద్య విధానాలు. శుభ్రత, స్టెరిలైజేషన్ మరియు నాణ్యతలో అత్యుత్తమ నిర్వహణలు ఈ సర్టిఫికేషన్ ముఖ్య ప్రయోజనాలు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ 3ఎం సాంకేతిక మార్గదర్శకత్వంతో ఈ గుర్తింపు లభించడం గర్వకారణమని హాస్పటల్ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య అందించాలనే మా సంకల్పానికి ఇది మరో మైలురాయిగా నిలిచిందని తెలిపారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అధికార్లను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తులు జీవితాలు దర్భరంగా మారుతున్నాయని, యువత వీటి భారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వీటి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిఘా వ్యవస్థను పటిష్ఠంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టిసి ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు కండెక్టర్లు, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానా స్పద వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచార ం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటరమణ, డిఎస్‌పి ఆదినారాయణ, జిల్లా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ అశ్వనితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రజా సంస్కృతి పరిరక్షణ కోసం, అభ్యుదయ భావజాల వ్యాప్తికై కళాకారులు ఐక్యం కావాలని ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కార్యదర్శి అరెంపుల సతీష్ పిలుపునిచ్చారు. నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, మనువాద, ఫాసిస్టు భావజాలానికి వ్యతిరేకంగా సమాజాన్ని చైతన్యపరచడమే కళాకారుల బాధ్యత అన్నారు. ఈ నెల 25, 26 తేదీలలో హైదరాబాద్‌లో సుమారు 5,000 మంది కళాకారులతో నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక రాష్ట్ర మహాసభలకు ఖమ్మం జిల్లా నుండి కళాకారులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు కాంపాటి శ్రీను, కుమారి, మనోజ్ కుమార్, రాంబాబు, డప్పు వీరబాబు, సలీం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ పేదవాడికి అండగా పీఎస్ఆర్ ట్రస్టు

### 147 మందికి రూ.10 వేల చొప్పున అందజేత



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రతీ పేదవాడి కుటుంబానికి పీఎస్ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు పేర్కోన్నారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన 147 కుటుంబాలకు పీఎస్ ఆర్ ట్రస్టు నుంచి రూ. 10 వేల చొప్పున శుక్రవారం అందించారు. మృతుల కుటుంబాలను సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, ట్రస్టు ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం ను అందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆర్థిక సహాయం ను అందిస్తాన్నారని అన్నారు. వారికి మంత్రి అండగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, పాకనాటి కన్నారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, తిగుళ్ల భవాని, వడ్లమూడి నర్సయ్య, మందడి నాగశ్రీను, వుల్లోజి ప్రభుదాసు, కర్ల ఆశోక్, కొమ్మినేని విజయ్ బాబు, కొమ్మినేని పుష్పావతి, కర్ల ఏసు, బోయిన కొండలు, అప్పారావు, వడ్లమూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రైతు కూలీ సంఘం మహాసభ




**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) మండల మహాసభ పూనెం రంగయ్య, మెస్సు గోపాల్, వాగబోయిన రాంబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత మెస్సు గోపాల్ జెండా ఆవిష్కరణ చేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అన్యాయం చేస్తున్నాయని, వ్యవసాయ మార్కెట్లను కార్పొరేట్లకు అప్పగిస్తున్నాయని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, వరి కొనుగోళ్లలో రైతులు క్వింటాకు రూ 600 నుంచి రూ 800 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమరం సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మెస్సు గోపాల్, బొర్ర వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా పూనెం రంగయ్య, సహాయ కార్యదర్శులుగా వాగబోయిన రాంబాబు, గొగ్గెల బొజ్జయ్య, కోశాధికారిగా బత్తిని సత్యం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా తోట వీరభద్రం, పూసం రాంబాబు, ఈసం ఎల్లయ్య, పూనెం రమేష్, పూనెం బతకయ్య, బొమ్మెర్ల సమ్మయ్య, ఇస్లావత్ రామదాసు ఎన్నికయ్యారు. నూతన కమిటీతో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో సంఘ నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాను రూపొందించేందుకు సహకరించండి



**-అర్హుల పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు**
**-ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై కలెక్టర్ సమావేశం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓటరు జాబితాను సమగ్రంగా, పారదర్శకంగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తిగా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించే లక్ష్యంతో ప్రత్యేక ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25 జూన్ 2026 నుంచి ప్రారంభమై 1అక్టోబర్ 2026న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగుస్తుందన్నారు. 25 జూన్ నుంచి 24 జులై వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ముందుగానే ముద్రించిన ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన తర్వాత క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. విచారణలు, ధృవీకరణ ప్రక్రియ కొనసాగిన అనంతరం తుది ఓటరు జాబితా ప్రచురిస్తారని వివరించారు. ప్రతి ఇంటికి బిఎల్‌వోలు కనీసం మూడు సార్లు వెళ్లి ఫారాల పంపిణీ, సేకరణ చేపడతారని పేర్కొన్నారు. మరణించిన వలస వెళ్లిన తదితర ఓటర్ల విషయంలో తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. మ్యాపింగ్ పూర్తి కాని ఓటర్లు జనన, పాస్‌పోర్టు, విద్యార్హత, కుల తదితర 12 రకాలు డాక్యుమెంట్స్‌ను సమర్పించాల్సి ఉందన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలను కలెక్టర్ వివరంగా నివృత్తి చేశారు. రాజకీయ పార్టీలు బిఎల్‌వోలను నియమించిన వెంటనే వారికి ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల సంబంధిత శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎదిర గుట్టల్లో చిరుత పులి సంచారం



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం నియోజకవర్గ అడవుల్లో చిరుత సంచారం కలవరం పుట్టిస్తోంది. చర్ల మండల పరిధిలోని ఎదిర గుట్టల అడవుల్లో గురువారం రాత్రి ఓ చిరుతపులి రోడ్డుకు అడ్డంగా రావడంతో అటుగా వెళుతున్న వాహన దారులు వీడియో చిత్రీకరించారు. ఇది సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. కారు లైట్ల వెలుతురుకు కంగారుపడ్డ చిరుత రోడ్డుకు అటుఇటూ తిరుగుతూ పొదల్లోకి జారుకుంది. దీనిని చర్ల మండల అటవీ అధికారులు కూడా ధృవీకరించినట్లు తెలుస్తోంది. కాగా గత కొంతకాలంగా జిల్లాలోని అడవుల్లో పులుల సంచారం క్రమంగా పెరుగుతోంది. గతంలో అశ్వారావుపేట అటవీ ప్రాంతంలోని కావడిగండ్ల అడవుల్లో చిరుతసంచరించి పశువులను చంపి ఆహారంగా మార్చుకున్న విషయం విధితమే. అతే కాకుండా ఆళ్లపల్లి, గుండాల, మణుగూరు అటవీ ప్రాంతాల్లో పులుల సంచారాం ఉన్నట్లు గతంలో అటవీ అధికారులు ధృవీకరిచి వీడియోలు కూడా విడుదల చేశారు. ఈ పులులు పై ప్రాంతంలోని అడవుల గుండా జిల్లా అడవుల్లోకి ప్రవేశించాయన్నారు. జిల్లాలో మొత్తంగా మూడు పులులు సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గతంలో తెలిపారు. ఎదిరగుట్టల్లో సంచరించిన పులి చిన్న వయస్సు ఉన్నది ఉండటంతో ఈ ప్రాంతంలో పులల సంతతి అభివృద్ధి చెందుతున్నట్లు భావిస్తున్నారు. ప్రజలు అటవీ ప్రాంతాల్లో ప్రయాణాలు చేసేసమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పులులు తారసపడితే వాటికి ఎలాంటి హామీ తలపెట్టవద్దని, తమకు సమాచారం అందించాలని అటవీ అధికారులు కోరుతున్నారు.

# అబ్బురపరుస్తున్న జోయాలుక్కాస్ డైమండ్ షో



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన జోయాలుక్కాస్ వారి బ్రిలియన్స్ డైమండ్ జ్యూయలరీ షో అలరిస్తుంది. మే 22 నుంచి జూన్ ఏడు వరకు ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో డైమండ్ జ్యూయలరీ నైపుణ్యం తో ఆకట్టుకుంటున్నాయి. పెండ్లి సెట్ల నుంచి సమకాలిన డైలీవేర్ ఆభరణాల వరకు ఈ ప్రదర్శనలో శాశ్వతమైన సాంప్రదాయాన్ని సౌందర్యంతో మిళితం చేసే వస్తువులు కనిపిస్తున్నాయి. ప్రతి డిజైన్ కూడా అద్భుతంగా ఉండడంతో వినియోగదారులను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ మరియు ఎండి డా॥ జాయలుక్కాస్ మాట్లాడుతూ బ్రిలియన్స్ డైమండ్ జ్యూయలరీ షో అనేది డైమండ్స్ యొక్క శాశ్వత ఆకర్షణకు, డిజైన్ల పట్ల మా సంస్థకు ఉన్న అభిరుచికి నిదర్శనమన్నారు. ఖమ్మం మా హృదయాల్లో ఒక సుస్థిర స్థానాన్ని సాధించిందని ఆయన తెలిపారు. ప్రత్యేకమైన, నాణ్యమైన డిజైన్లను కనుగొనడానికి ఈ ప్రదర్శన ఒక అవకాశం ఇస్తుందన్నారు. లక్ష రూపాయల నుంచి అంత కంటే విలువైన డైమండ్ జ్యూయలరీ నగలు కొనుగోలు చేసిన ప్రతి కస్టమర్‌కు ఒక బంగారు నాణెం ఉచితంగా అందిస్తున్నామన్నారు. డైమండ్స్ ప్రపంచాన్ని అన్వేషించేందుకు, అస్వాదించేందుకు ఈ ప్రదర్శనను తిలకించాలని జాయలుక్కాస్ కోరారు.

# వీఓఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/చింతకాని :** వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ కల్పించాలని కోరుతూ చింతకాని మండల వీఓఏలు శుక్రవారం సమ్మె బాట పట్టారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వీఓఏల మండల కార్యదర్శి బి అరుణ మాట్లాడుతూ గత 25 ఏండ్లుగా డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి వారి అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న వీఓఏలు కనీస వేతనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వీఓఏల పాత్ర తప్పనిసరిగా ఉందన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌పాలసీ అమలు చేయడంతో పాటు అర్హులైన వీఓఏలను సీసీలు గా పదోన్నతి కల్పించాలన్నారు. సాధారణ , ఆరోగ్య భీమా రూ.20లక్షలు కల్పించాలన్నారు. 58 జీఓను రద్దుచేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు ధనలక్ష్మీ , నాగరాణి, సైదులు, నాగేశ్వరి, పుష్ప, రిజ్వానా, నాగమణి, హైమారావు, జరీనా తదితరులు పాల్గొన్నారు.

# వేతన నిర్ణయ ప్రకటన సహేతుకం కాదు

**-పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల ప్రకటన సహేతుకంగా లేదని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను నామ మాత్రంగా పెంచిందని ఇది పెరిగిన ధరలకు అనుగుణంగా లేదని ఆయన తెలిపారు. కనీస వేతనాల పెంపుకు సంబంధించి శుక్రవారం శింగు నర్సింహారావు ఒక ప్రకటన విడుదల చేశారు. 1.11 కోట్ల మంది కార్మికులకు సంబంధించిన ఈ విషయంలో వాస్తవానికి ప్రభుత్వ ప్రకటనకు సంబంధం లేదన్నారు. 2012లో కనీస వేతనాలు నిర్ణయించారని పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం వేతనాల పెంపు గురించి ఏనాడు పట్టించుకోలేదన్నారు. దశాబ్ద కాలానికి పైగా జరిగిన ఆందోళనలు, పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన సవరణకు అంగీకరించడం హర్షించదగ్గ పరిణామమే అయినా ప్రభుత్వ ప్రకటన మాత్రం కార్మిక వర్గానికి విస్మయం కలిగిందన్నారు. మూడు జోన్లలో నైపుణ్యతకు సంబంధించి నాలుగు కేటగిరీల్లో పెంచిన వేతనం ఏ మాత్రం శాస్త్రీయంగా, సమాంజసంగా లేదని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా లేదు కాబట్టి జోన్ 1లో 25 శాతం నుండి 36కు, జోన్ 2లో 20 నుంచి 30 శాతం, జోన్ 3లో 12 నుంచి 23 శాతం అతి తక్కువ పెరుగుదలను సూచించారని ఇది కార్మిక వర్గాన్ని తీవ్ర అసంతృప్తికి గురి చేసిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు రెట్టింపుకు మించి పెరిగిన సందర్భంలో కనీస వేతనం కూడా ఆ స్థాయిలో పెరగాలన్నారు. కార్మికుల వేతనాలు దారుణంగా పడిపోతున్నాయని పదేళ్ల క్రితం రూ.70లు ఉన్న కిలో నూనె ధర ఇప్పుడు రూ.180లకు పెరిగిందని అదే రీతిలో వేతనాలను కూడా నిర్ధారించాల్సి ఉందని నర్సింహారావు కోరారు. ఖమ్మంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఒప్పందంలో తాపీమేస్త్రీకి రూ.1050 చొప్పున ధర నిర్ణయించారని కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనం సహేతుకంగా లేదని కనీస వేతనం నెలకు రూ.26 వేలకు తగ్గకుండా ఇవ్వాలని కార్మిక సంఘాలు రెండేళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడుతున్నాయని నర్సింహారావు గుర్తు చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో వస్తువుల ధరలు పెరుగుతున్నాయని ధరలను నియంత్రించలేని ప్రభుత్వం కనీస వేతనాలను నిర్ధారించేటప్పుడు ప్రస్తుత పరిస్థితులను గమనంలోకి తీసుకోవాల్సి ఉన్నారు. 26వేల రూపాయలకు తక్కువ కాకుండా కనీస వేతనాలను నిర్ధారణ చేసి నైపుణ్యతల ఆధారంగా పెరుగుదల ఉండాలని లేని పక్షంలో ఏఐటియుసి పక్షాన ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు.

# మొక్కజొన్న పొలాల్లో మంటలు

## ఖమ్మం బోనకల్ రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండల పరిధిలోని సీతంపేట, లచ్చగూడెం, కొదుమూరు, రాఘవాపురం, జగన్నాధపురం, పందిళ్ళపల్లి గ్రామాల సమీపంలోని మొక్కజొన్న పొలాల్లో కొందరు రైతులు మొక్కజొన్న పొలాలను శుభ్రం చేసేందుకు చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగి చుట్టు పక్కన పొలాలకు వ్యాపించాయి. దీంతో సీతంపేట గ్రామంలో పొలాలకు దగ్గర్లో ఉన్న ఓ పూరిళ్లు దగ్ధం కాగా మామిడి తోటకు మంటలు వ్యాపించాయి. రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పందిళ్లపల్లి సమీప పొలాల్లో మంటలు ఖమ్మం బోనకల్ ప్రధాన రహదారిపై దట్టమైన పొగలు వ్యాపించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చింతకాని ఎస్సై వీరేందర్ ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామల్లో రైతులు తమ పంట పొలాల్లో అవశేషాలను కాల్చవద్దన్నారు.

# యూట్యూబర్ ‘ఓకే సాయి’ బాగోతం బట్టబయలు




**-ట్రాప్ షిప్పింగ్ కోర్సుల పేరుతో యువకులకు టోకరా...?**
**-వంచనతో అనతి కాలంలోనే కోట్లకు పడగెత్తిన యువకుడు**
**-ఆంధ్రాకు చెందిన యువకుల ఫిర్యాదుతో వెలుగులోకి..**
**-కారేపల్లి పీఎస్‌లో చీటింగ్, ఐటీ యాక్ట్ కేసులు నమోదు**

**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం సూర్యతండాకు చెందిన యూట్యూబర్ బానోత్ సాయినాథ్ అలియాస్ ఓకే సాయిపై నమోదైన కేసులు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారియి. పెట్టుబడి లేకుండా లక్షాధికారి కావచ్చు, స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు లక్షలు సంపాదించవచ్చు అంటూ ట్రాప్ షిప్పింగ్ కోర్సుల పేరుతో యువకులను ఆకర్షించి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు యువకులు కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రాజా, అర్ధాని శ్రీనివాస్, సూర్యభాను, శ్రీ పవన్ సాయి, విప్పర్తి దిలీప్, కొల్లి మనోహర్, చంద్రహాస రెడ్డి, బంటి అజయ్, నరసింహులు తదితరులు కోర్సుల్లో చేరి మోసపోయామని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వేలాది రూపాయలు చెల్లించి కోర్సులు చేసినప్పటికీ ఎలాంటి ఆదాయం రాకపోవడంతో తాము మోసపోయామని బాధితులు ఆరోపిస్తున్నారు. మరో యూట్యూబర్ బయటపెట్టిన వివరాల ప్రకారం 788 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ 18వేల చొప్పున వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అతి సామాన్య కుటుంబానికి చెందిన సాయినాథ్ కొద్ది కాలంలోనే కోట్లకు పడగెత్తడం, ఖరీదైన కార్లు, భారీ బంగారు ఆభరణాలతో తిరగడం, కారేపల్లి సుమారు రూ 2కోట్ల వ్యయంతో విలాసవంతమైన భవనం నిర్మించుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. గతంలో హైదరాబాద్‌లో నమోదైన ఓ చీటింగ్ కేసులో కోర్టుకు హాజరు కాకపోవడంతో వారెంట్ జారీ కాగా, కారేపల్లి పోలీసులు అరెస్టు చేసి హైదరాబాద్ పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కారేపల్లి ఎస్ఐ గోపి మాట్లాడుతూ సాయినాథ్ అలియాస్ ఓకే సాయిపై చీటింగ్, ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు తీవ్రత దృష్ట్యా సీఐ స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

# మూలన పడుతున్న ఆర్ఓ ప్లాంట్లు

## పట్టించుకోని సింగరేణి యాజమాన్యం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్లు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై మూలన పడుతున్నాయి. కోట్ల రూపాయల ఆదాయం ఆర్జిస్తున్న సింగరేణి సంస్థ, తమ కార్యకలాపాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, వాటి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ కొంత కాలంగా పనిచేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్లాంట్ మరమ్మతుల విషయమై సింగరేణి అధికారులను సంప్రదించగా, అది తమ పరిధిలో లేదని, మున్సిపాలిటీకి అప్పగించామని సమాధానం ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు. మరో వైపు మున్సిపల్ అధికారులను ఆశ్రయించగా, ఆ ప్లాంట్ల నిర్వహణ బాధ్యత సింగరేణిదేనని చెబుతూ చేతులు దులుపుకుంటున్నారని వారు వాపోతున్నారు. ఇప్పటికే సింగరేణి కార్యకలాపాల కారణంగా తమ కాలనీ తీవ్రంగా దెబ్బతిన్నదని, కనీసం సురక్షితమైన తాగునీరు కూడా అందించని పరిస్థితి నెలకొనడం దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను పట్టించుకోకుండా అధికారులు పరస్పరం బాధ్యతలు తప్పించుకోవడం వల్లే ఆర్ఓ ప్లాంట్లు పనికిరాకుండా పోతున్నాయని విమర్శిస్తున్నారు. తక్షణమే ఆర్ఓ ప్లాంట్‌ను మరమ్మతు చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే త్వరలోనే సింగరేణి కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.